aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
శుక్రవారం 30-01-2026 సంపుటి : 01 సంచిక : 5 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
besqati.com
Contact : info@besqati.com



## గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ
# అగ్రస్థానమే లక్ష్యం

- కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం
- హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సిఎం రేవంత్

**హైదరాబాద్–29 జనవరి (మహాప్రభ)**

విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సిఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు . ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో

-మిగతా 3 లో




# కేసీఆర్‌కు నోటీసులు

**సిటీ పరిధిలో ఎక్కడికైనా వస్తాం**



### మాజీ సీఎం కేసీఆర్‌ను నేడు విచారణకు పిలిచిన సిట్

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరో తేదీ ఇవ్వాలన్న కేసీఆర్
- నేడు నిర్ణయం తీసుకుంటాం : సిట్ అధినేత సజ్జనార్
- కేసీఆర్‌కు నోటీస్‌పై రోజంతా హల్‌చల్
- ఈ కేసు సిల్లీ విషయం : కేసీఆర్

**హైదరాబాద్–29 జనవరి (మహాప్రభ)**

గత రెండేండ్లుగా ఉత్కంఠ రేపుతున్న ఫోన్‌ట్యాపింగ్ కేసు దాదాపు పరాకాష్టకు చేరుకున్నది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సిట్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. విచారణ జరపడానికి మీరు(కేసీఆర్) ఎక్కడికి పిలిచినా వస్తామని, అయితే విచారణ జరిపే స్థలం హైదరాబాద్ సిటీ పరిధిలోనే ఉండాలని అందులో స్పష్టం చేశారు.

-మిగతా 3 లో



# జీడీపీ వృద్ధిరేటు తగ్గుదల


- ద్రవ్యోల్బణం పెరుగుదల
- రూపాయి విలువ పతనమైనా.. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించదు
- 2026-27 ఆర్థిక సర్వే అంచనా
- పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ -29 జనవరి (మహాప్రభ)**

ఎగుమతులపై పెరుగుతున్న నియంత్రణలు అభివృద్ధి చెందిన దేశాల సాంకేతిక తిరస్కరణలు, కార్బన్ పన్ను విధానాల మధ్య దేశంలో స్వదేశీపై దృష్టి పెట్టడం అనివార్యం, అవసరం అని ఇది ప్రపంచీకరణ ముగింపును సూచిస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఇండియా-ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఎగుమ తులు, పోటీతత్వం పెరగనున్నాయని అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా 2.0' పై దృష్టి కేంద్రీకరించి.. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, పునరుత్పాదక శక్తి రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహాలు అందిస్తున్నట్టు తెలిపారు. డిజిటల్ పేమెంట్లు, ఫిన్‌టెక్, ఏఐ వినియోగం వేగంగా పెరుగుతూ ఇండియాను ప్రపంచస్థాయి టెక్ హబ్ గా మలుస్తున్నాయని అన్నారు.

సౌర, వాయు, హైడ్రోజన్ వంటి గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించి, స్థిరమైన వృద్ధికి అనుకూలంగా మద్దతు కొనసాగుతోందని చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల లో ఇండియా ఒకటిగా మారుతున్న తరుణంలో అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర కలిగిన అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వినియోగం పెరుగుతుండటంపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ఉదయం నుంచి రాత్రి చివరి వరకు వాటి ప్రకటనలపై నిషేధం విధించాలని సూచించింది. పిల్లలలో పెరుగుతున్న ఊబకాయాన్ని తగ్గిస్తూనే, శిశువులు, పసిపిల్లల పాలు, పానీయాల మార్కెటింగ్‌పై పరిమితులను విధించాలని సూచించింది. "ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఐదేండ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అధిక బరువు ప్రాబల్యం 2015-16లో 2.1 శాతం నుంచి 2019-21లో 3.4 శాతానికి పెరిగింది" అని సర్వే వెల్లడించింది.

-మిగతా 3 లో



# అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు..

- అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు
- ప్రభుత్వ లాంఛనాలతో దివంగత నేతకు వీడ్కోలు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి

**ముంబై,-29 జనవరి (మహాప్రభ)**

అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు.. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని

-మిగతా 3 లో

# మేడారంలో కొలువుదీరిన వనదేవతలు

- నేడు దర్శనానికి పోటెత్తనున్న భక్తులు
- ముగిసిన సమ్మక్క ఆగమన ఘట్టం
- మంత్రులు పొంగులేటి, సీతక్క పర్యవేక్షణ



**వరంగల్ -29 జనవరి (మహాప్రభ)**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'మేడారం' మహా ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకోవడంతో వనదేవతలందరూ కొలువుదీరినట్టయింది.

-మిగతా 3 లో



## పరిశుభ్రమైన గాలితోనే
# నిజమైన అభివృద్ధి

- స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానం అవలంబిస్తున్న తెలంగాణ
- నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు
- గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు
- త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం
- కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు
- గాలి నాణ్యత సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్,–29 జనవరి (మహాప్రభ)**

పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళు తుందని అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం లో 'గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా

-మిగతా 3 లో

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

- ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, -29 జనవరి (మహాప్రభ)**

పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ూష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య

-మిగతా 3 లో



# ఇది విచారణ కాదు.. ప్రతీకారం

- న్యాయం కాదు రాజకీయ దురుద్దేశం
- కేసీఆర్‌కు సిట్ నోటీసులు దుర్మార్గం : కేటీఆర్

**హైదరాబాద్–29 జనవరి (మహాప్రభ)**

ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులివ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది విచారణ కాదనీ, ప్రతీకా రమని తెలిపారు. ఇది న్యాయం కాదనీ, రాజకీయ దురుద్దేశమని పేర్కొన్నారు. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని వివరించారు. పదేండ్ల పాలనతో ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకున్నారని తెలిపారు. అనేక పథకాలతో

-మిగతా 3 లో

## ఫిబ్రవరి 12న జేఈఈ
# మెయిన్-1 ఫలితాలు



### ముగిసిన పరీక్షలు

**హైదరాబాద్, -29 జనవరి (మహాప్రభ)**

జేఈఈ మెయిన్-1 ఫలితాలు ఫిబ్రవరి 12న విడుదలకానున్నాయి. వీలైతే 12కు ముందే ఫలితాలు వెల్లడించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ/ఎన్టీఏ భావిస్తున్నది. జేఈఈ మెయిన్-1 పరీక్షలు ఈ నెల 21న ప్రారంభమయ్యాయి. పేపర్-1 పరీక్షలు బుధవారంతో ముగియగా, పేపర్-2 పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఒకటి, రెండు రోజుల్లో ప్రాథమిక కీ,

-మిగతా 3 లో

# అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

- టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి
- కేంద్రాన్ని హెచ్చరించిన ఆర్థిక సర్వే



**న్యూఢిల్లీ -29 జనవరి (మహాప్రభ)**

వస్తువులు, సేవల విషయంలో అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐ, ట్రేడ్ కంట్రోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. లేదంటే అమెరికా, చైనా దేశాల మధ్య భారత్ క్రాస్ ఫైర్ అవ్వక తప్పదని తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2026 - 27 సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 'ది ఎకనామిక్ సర్వే 2025 - 26' భారత్‌ను హెచ్చరించింది. అమెరికా, చైనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఎకనామిక్ సర్వే ప్రకారం..

-మిగతా 3 లో

# రాహుల్ గాంధీయే కాంగ్రెస్‌కు బూస్ట్, హార్లిక్స్..

- విజయ్ మద్దతు అవసరం లేదు.. కాంగ్రెస్ స్పష్టం

**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టీవీకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయనే ప్రచారంలో నిజం లేదా..? తాజాగా తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై స్పందించిన తీరే ఇందుకు నిదర్శనం. తమకు టీవీకేతో పొత్తు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీకి రాహుల్ గాంధీయే బూస్ట్, హార్లిక్స్ అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల విజయ్ తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌తో కలిసి సాగేందుకు సిద్ధమని ప్రకటించారు.'కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర, వారసత్వం ఉంది. ఆ పార్టీ పునర్వైభవానికి మద్దతిచ్చేందుకు విజయ్ సిద్దంగా ఉన్నారు. ఈ అవకాశాన్ని వాడుకోవాలో వద్దో



అనేది కాంగ్రెస్ చేతిలోనే ఉంది. తమిళనాడులో ఆ పార్టీ రాజకీయంగా పుంజుకోవడానికి ఇబ్బందులు పడుతోంది" అని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తమిళనాడు చీఫ్ కె.సెల్వపెరుంతగై స్పందించారు. విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఒక్కసారి మా పార్టీ కార్యకర్తల్ని చూడండి. వాళ్లకు ఇప్పటికే చాలా ఉత్సాహంగా ఉన్నారు. మా పార్టీకి అవసరమైన బూస్ట్, హార్లిక్స్, బోర్నవిటా ఇవ్వడానికి రాహుల్ గాంధీ ఉన్నారు" అని అన్నారు. అంటే ప్రస్తుతానికి టీవీకేతో పొత్తు ఆలోచన లేదని ఆయన చెప్పారు. మరోవైపు ఈ అంశంపై అటు టీవీకే తరఫున విజయ్, ఇతర పార్టీ నేతలు స్పందించలేదు. ఇక.. ఎంతోకాలంగా డీఎంకేతో పొత్తులో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈసారి ఆ అవకాశం లేనట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో డీఎంకే అంత సుముఖంగా లేదు. అలాగని కాంగ్రెస్ కూడా సొంతంగా పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ ఎవరితో ఒకరితో పొత్తు పెట్టుకోవాల్సిందే.

# పనుల్లోకి స్థానికుల్ని తీసుకోండి.. మియా ముస్లింలను కాదు..

## అసోం సీఎం సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టర్లు.. పనులు చేసేందుకు మియా ముస్లింలను కాకుండా స్థానిక ప్రజల్ని కార్మికులుగా తీసుకోవాలని సూచించారు. అవసరమైతే మియా ముస్లింలను అడ్డుకోవాలని తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ అంశం అసోంలో రాజకీయ వివాదానికి దారి తీసింది. మియా ముస్లింలు అంటే.. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ముస్లింలు.వారు అక్రమంగా నివసిస్తుంటారు. వారు దశాబ్దాలుగా అసోంలో కార్మికులుగా వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. ఎక్కువ మంది కార్మికులు మియా ముస్లింలే. కారణం.. వీరు చాలా తక్కువ వేతనాలకే పని చేస్తారు. అందుకే కాంట్రాక్టర్లు కూడా వీరికే ప్రాధాన్యమిస్తుంటారు. దీంతో స్తానికులకు ఉపాధి దొరకడం లేదని అసోంలోని ఇతర వర్గాల వారు అంటున్నారు. ఈ




నేపథ్యంలో తమ రాష్ట్ర ప్రజలనే తీసుకోవాలని కాంట్రాక్టర్లకు సీఎం హిమంత బిశ్వ శర్మ సూచించడం విశేషం. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ "అస్సామీలు మొఘల్స్‌పై యుద్ధాలు గెలవగా లేనిది బ్రిడ్జిలు ఎందుకు కట్టలేరు..? బోగిబీల్ బ్రిడ్జిని స్తానికులే కట్టారు. మార్పు రావాల్సిన సమయం వచ్చింది. అందుకే మియా ముస్లింలను కాకుండా స్థానిక ప్రజల్నే పనుల్లోకి తీసుకోమని ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్లకు చెప్పాను. ధుబ్రి, బార్పెట వంటి వెనుకబడిన ప్రాంతాలవారికి ప్రాధాన్యమివ్వాలి. నా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు కూడా చెబుతున్నా.. ఇందులో దాచేదేమీ లేదు. అవసరమైతే మియా ముస్లింలను ఎలాగైనా అడ్డుకోండి. వారికి ఇబ్బంది అయితే.. రాష్ట్రం విడిచివెళ్లొచ్చు. మేం మియా ముస్లింలకు వ్యతిరేకం అని నేరుగా చెప్తున్నాం. నేను వారిని ఇబ్బంది పెట్టాలనుకుంటే అర్ధరాత్రి అయినా వెళ్తాను" అని అన్నారు. మరోవైపు అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌పై కూడా హిమంత బిశ్వ శర్మ విమర్శలు గుప్పించారు. అతడు పాకిస్తాన్ ఏజెంట్ అని మళ్లీ చెబుతున్నానని, అవసరమైతే దీనిపై తన మీద చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సవాలు విసిరారు. వారికి దమ్ముంటే తన మీద కేసు వేయండి అంటూ ఛాలెంజ్ చేశారు. అయితే, మియా ముస్లింలపై ఆయన చేసిన వ్యాఖ్యల్ని కాంగ్రెస్ వర్గాలు ఖండిస్తున్నాయి.

## ఆ ఒప్పందం మమ్మల్ని తీవ్ర నిరాశపరిచింది..

### భారత్ -- ఈయూ ట్రేడ్ డీల్‌పై అమెరికా అసంతృప్తి

**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
భారత్- యూరప్ వాణిజ్య ఒప్పందం పై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉక్రెయిన్ ప్రజల కంటే కూడా ఈరోపియన్ యూనియన్ వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుందని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ విమర్శించారు. ఈ ఒప్పందం తమను తీవ్ర నిరాశపరిచిందని తెలిపారు.సీఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్నామని ఈయూ ఒకవైపు చెబుతూనే.. మరోవైపు రష్యా యుద్ధాన్ని కొనసాగించేందుకు పరోక్షంగా ఆర్థికసాయం



చేస్తున్నాయని తెలిపారు. ఇది పూర్తిగా ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. భారత్‌తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా యూరప్ దేశాలు తమ వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేసినట్లు అర్థమవుతుందని అన్నారు. వాళ్లు తమకు ఏది మేలు అనిపిస్తే అది చేయాలి.. కానీ యూరప్ వైఖరి నన్ను తీవ్ర నిరాశకు గురిచేసిందని వ్యాఖ్యానించారు. యూరప్ దేశాలు రష్యా నుంచి నేరుగా చమురు కొనుగోలు చేయకపోయినా.. భారత్‌లో శుద్ధి చేసిన ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయని బెసెంట్ తెలిపారు. రష్యా చమురు భారత్‌కు వస్తోంది.. అక్కడ శుద్ధి అయ్యాక యూరప్‌నకు వెళ్తున్నది.. అంటే పరోక్షంగా యూరప్ రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చుతున్నట్లే అని వివరించారు.భారత్‌తో ఈయూ కుదుర్చుకున్న ఒప్పందం వల్ల రెండు దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా పెరుగుతుంది.. ఫలితంగా అమెరికాపై ఆధారపడటం తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఒప్పందంతో భారత్ నుంచి యూరప్ దిగుమతులు పెంచుకోవడంతో పాటు అమెరికాతో ఉన్న వాణిజ్య ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా ఇలా కామెంట్లు చేసిందని చెబుతున్నారు.

# వీధి కుక్కల కేసులో తీర్పుని రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
వీధి కుక్కల కేసులో గతంలోని ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పుని రిజర్వ్ చేసింది. పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ మరియు రాజస్థాన్ వంటి రాష్ట్రాలు తీసుకున్న చర్యలను క్లుప్తీకరించి అమీకస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ నివేదికను పరిశీలించిన అనంతరం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్



ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. ఎన్‌హెచ్ఎఐ తరపు న్యాయవాది వాదనలను కూడా ధర్మాసనం విచారించింది. వీధుల్లో తిరిగే జంతువులను తొలగించాలని, జాతీయ రహదారులు, రోడ్లపై ఫెన్సింగ్ నిర్మించాలని ఎన్‌హెచ్ఎఐ గతేడాది నవంబర్ 7న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. జంతు సంరక్షణ కేంద్రాలు లేదా జంతు జనన నియంత్రణ సౌకర్యాలకు అనుమతి కోరుతూ ఎన్‌జీఓ దాఖలు చేసిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుబిఐ)ని ఆదేశించింది.

## కుప్పకూలిన మరో విమానం..

ఎంపీ సహా 15 మంది దుర్మరణం..



**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
మహారాష్ట్ర లోని బారామతి విమానం కుప్పకూలి ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణించిన ఘటనను మరువకముందే అలాంటిదే మరో ఘటన జరిగింది. అయితే ఈ ప్రమాదం మన దేశంలో చోటుచేసుకోలేదు. కొలంబియా లోని ఈశాన్య ప్రాంతంలో జరిగింది. ఈ ప్రమాదంలో ఒక ఎంపీ సహా మొత్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారు.ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఈశాన్య కొలంబియాలోని శాంటాడెర్ రీజియన్‌లోని గ్రామీణ ప్రాంతంలో కూలిపోయిందని అధికారులు తెలిపారు. విమానం అక్కడి కాలమాన ప్రకారం బుధవారం ఉదయం 11.42 గంటలకు కుకుటలోని కామిలో డజా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అదేరోజు మధ్యాహ్నం 12.05 గంటలకు ఒకానాకు చేరాల్సి ఉంది. కానీ ఉదయం 11.54 గంటలకు టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. విమానంలోని 15 మంది దుర్మరణం పాలయ్యారు. వారిలో కాంగ్రెస్ ఎంపీ డియోజీన్స్ క్వింటెరో కూడా ఉన్నారు. క్వింటెరో ప్రయాణిస్తున్న విమానం టేకాఫ్ అయినప్పటి నుంచే ఆయనతో, ఆయన అసిస్టెంట్‌తో కాంటాక్ట్స్ తెగిపోయాయని, ఆయన కమ్యూనికేషన్స్ టీమ్ తెలిపింది.

# రూమర్స్‌కు చెక్


రాహుల్ గాంధీ, ఖర్గేను కలిసిన శశి థరూర్..



**న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలకు, శశి థరూర్‌కు మధ్య దూరం పెరిగిందనే విమర్శలకు స్వయంగా శశి థరూర్ చెక్ పెట్టారు. గురువారం ఆయన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, మరో అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. పార్లమెంట్ హౌస్‌లో, ఖర్గే ఛాంబర్‌లో తాను ఇద్దరు నేతలను కలిసినట్లు శశి థరూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా వారితో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇద్దరికీ ధన్యవాదాలు తెలిపారు.అనేక అంశాలపై చర్చించినట్లు, దేశానికి సేవ చేసే అంశంలో కలిసి సాగుతున్నట్లు శశి థరూర్ పేర్కొన్నారు. దాదాపు 30 నిమిషాలపాటు వీరు పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన సందర్భంగా ఇద్దరు నేతలను కలుసుకున్నానని, ఇందులో ప్రత్యేకత ఏముంటుందని ఆయన మీడియాకు తెలిపారు. కొంతకాలంగా శశి థరూర్‌కు, పార్టీలోని అగ్రనాయకత్వానికి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశానికి కూడా శశి థరూర్ గైర్హాజరయ్యారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి దూరమవుతున్నారా అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇదే అంశంపై కొందరు కాంగ్రెస్ నేతలు శశి థరూర్‌పై మండిపడ్డారు. థరూర్ 17 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన కాంగ్రెస్ తరఫున ఎంపీగా కేరళలోని తిరువనంతపురం నుంచి, 2009 నుంచి వరుసగా పోటీ చేసి గెలుస్తున్నారు. అయితే, ఆపరేషన్ సింధూర్ విషయంలో ఆయన కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలపడం.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంతో వివాదం మొదలైంది. తాజాగా ఆయన ఈ వివాదానికి చెక్ పెడుతూ.. కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని కలిశారు.

## రక్తమోడిన ఛత్తీస్‌గఢ్ .. ఇద్దరు మావోయిస్టులు మృతి

**రాయ్‌పూర్:న్యూఢిల్లీ : -29 జనవరి (మహాప్రభ)**
ఛత్తీస్‌గఢ్ మరోమారు రక్తమోడింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్ జిల్లా



దక్షిణ భాగంలోని అడవీ ప్రాంతంలో గురువారం ఉదయం 7.00గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుండి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను, ఎకె47 రైఫిల్, 9ఎంఎం పిస్టల్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు. జనవరి 3న బస్తర్ ప్రాంతంలోని బీజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పద్నాలుగు మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో సుమారు 22మంది మావోయిస్టులు మరణించారు.

# కేసీఆర్‌కు నోటీసులు

మొదటి తరువాయి

అయితే తాను మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం విచారణకు హాజరు కాలేననీ, మరో తేదీ నిర్ణయించాలంటూ కేసీఆర్ సిట్ అధికారులకు లేఖ పంపించారు. దీంతో ఈ విచారణ మరో మలుపు తిరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు కేసీఆర్‌కు సిట్ నోటీసు ఇచ్చిన వ్యవహారంపై ఇటు అధికారుల్లోనూ, అటు బీఆర్ఎస్ వర్గాల్లోనూ చర్చోపచర్చలకు దారి తీసింది. 2024లో మార్చిలో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఫోన్‌ట్యాపింగ్ కేసులో వరుసగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో సహా ఐదుగురు పోలీసు అధికారులను సిట్ విచారించింది. వీరి తర్వాత ఈ నెలలోనే 20, 23, 27 తేదీల్లో బీఆర్ఎస్ అగ్రనాయకులు హరీశ్‌రావు, కేటీఆర్, సంతోశ్‌రావులను సిట్ విచారించింది. వీరి విచారణలో తేలిన అంశాలు, గతంలో ఎస్ఐబీ ప్రభాకర్‌రావు మొదలుకొని ఇతర అధికారులతో సాగిన విచారణలో కేసీఆర్ పేరు ప్రస్తావనకు రావడంతో తాజాగా గురువారం బీఆర్ఎస్ చీఫ్‌కు సిట్ అధికారులు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి సిట్ ఏసీపీ వెంకటగిరి నోటీసు తీసుకెళ్లగా.. ఆ ఇంట్లో ఎవరూ లేరు. దీంతో అక్కడ ఉన్న కేసీఆర్ సహాయకుడికి నోటీసు అందజేశారు. సెక్షన్ 160 ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు హాజరుకావాలని అందులో కేసీఆర్‌ను కోరారు. విచారణ జరపడానికి మీరు(కేసీఆర్) ఎక్కడికి పిలిచినా వస్తామని పేర్కొన్నారు. అయితే విచారణ జరిపే స్థలం హైదరాబాద్ సిటీ పరిధిలోనే ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు.

ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు కేటీఆర్, హరీశ్‌రావు

కేసీఆర్‌కు సిట్ నోటీసు జారీ చేసిందన్న వార్తతో సిరిసిల్లలో ఉన్న ఆయన కుమారుడు కేటీఆర్, హైదరాబాద్‌లో ఉన్న హరీశ్‌రావులతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకులు



హుటాహుటిన ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు చేరుకొని కేసీఆర్‌తో సమావేశమయ్యారు. సిట్ ఇచ్చిన నోటీసుపై ఏ విధంగా స్పందించాలి అని వారు ఒకపక్క మంతనాలు జరుపుతుండగా.. మరోపక్క కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలన్న విషయమై సిట్ అధికారులు కూడా తర్జనభర్జన సాగించారు. ఒకదశలో నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలోనే విచారించాలనే యోచించిన సిట్ అధికారులు... అక్కడ భద్రతా వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత అధికారులు వెళ్లి చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించారు.

65 ఏండ్ల వయస్సు దాటడం, మాజీ ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్ష నేత కావడంతో కేసీఆర్‌ను స్టేషన్‌కు పిలిచి విచారిం చడం సరికాదనీ, ఎక్కడ విచారించాలన్నది ఆయన నిర్ణయానికే వదిలేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇక కేసీఆర్ నుంచి సమాచారం కోసం అధికారులు రాత్రి వరకు ఎదురు చూశారు. మరోవైపు సిట్ అధినేత సజ్జనార్ నేతృత్వంలో ఇతర అధికారులు కేసీఆర్‌ను ఏయే అంశాలపై విచారించాలనే విషయమై బంజా రాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో సమావేశమై చర్చించారు. కాగా రాత్రి 8 గంటల తర్వాత తాను శుక్రవారం విచారణకు హాజరు కాలేనంటూ సిట్ ఏసీపీ వెంకటగిరికి కేసీఆర్ నుంచి లేఖ అందింది.

నేడు(30న) మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అనీ, ఆ రోజు తాను తన పార్టీ అభ్యర్థులకు ధ్రువపత్రాలను సంతకం చేసి అందించాల్సి ఉంటుందనీ, ఆ పనిలో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని లేఖలో వివరించారు. మరోరోజు ఎప్పుడైనా పిలిస్తే విచారణకు హాజరవుతానని కేసీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. తాను మాజీ ముఖ్యమంత్రిని, ప్రతిపక్ష నేతను కావడం వల్ల చట్టాన్ని గౌరవిస్తానని అన్నారు. అలాగే తన చిరునామా నందినగర్‌గాక ఎర్రవెల్లిలో ప్రస్తుతం తానుంటున్న ఫాంహౌస్‌నే తన నివాసంగా గుర్తించి ఇకపై ఎలాంటి నోటీసులున్నా అక్కడికే పంపాలని అధికారులను కోరారు. ఇక విచారణను కూడా తన ఎర్రవెల్లిలోని నివాసంలోనే జరపాలనీ, సెక్షన్ 160 సైతం 65 ఏండ్లు దాటిన వ్యక్తులను వారు కోరుకున్న చోటే విచారించాలని చెప్తుందని కేసీఆర్ ఉదహరించారు.

**మరో తేదీని నేడు నిర్ణయిస్తాం : సిట్ చీఫ్ సజ్జనార్**

30వ తేదీన విచారణకు తాను హాజరుకాలేనంటూ కేసీఆర్ పంపిన లేఖ తమకు అందిందని సిట్ అధినేత, నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ గురువారం రాత్రి వెల్లడించారు. ఈ విషయమై తాము సానుకూలంగా ఉన్నామనీ, శుక్రవారం తిరిగి కేసీఆర్‌ను ఏ రోజు విచారించేది నిర్ణయిస్తామని చెప్పారు. కాగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.

# జీడీపీ వృద్ధిరేటు తగ్గుదల

మొదటి తరువాయి

రూపాయి పతనంపై...

దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న అంశం రూపాయి విలువ. గత నెలలో ఇది రికార్డు స్థాయిలో పడిపోయింది. చరిత్రలో మొదటిసారిగా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 92కు చేరింది. అయితే ఈ పరిణామం ఆర్థిక వ్యవస్థ పనితీరును ప్రతిబింబించడం లేదని ఆర్థిక సర్వే తెలిపింది. మరో మాటలో చెప్పాలంటే రూపాయి తన వాస్తవ సామర్థ్యానికి తగినట్లు లేదు' అని చెప్పుకొచ్చింది.

ఆన్‌లైన్ తరగతులను తగ్గించాలి

సోషల్ మీడియా యాక్సెస్ కోసం వయోపరిమితిని, ఆన్‌లైన్ తరగతులను తగ్గించాలని ఆర్థిక సర్వే పేర్కొంది. పిల్లలకు సోషల్ మీడియా నిషేధం విధించాలనే సూచనలను తీసుకుంటూ..డిజిటల్ వ్యసనాన్ని నివారించడానికి ఆన్‌లైన్ బోధనను




తగ్గించుకుంటూనే, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు వయస్సు ఆధారిత ప్రాప్యతను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థిక సర్వే పేర్కొంది. పిల్లల డిజిటల్ అలవాట్లను రూపొందించడంలో, ఆన్‌లైన్‌లో హానికరమైన కంటెంట్‌కు గురికాకుండా నిరోధించడానికి పిల్లలకు విద్యా కంటెంట్ యాక్సెస్ కోసం సరళమైన పరికరాలను ప్రోత్సహించడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాలని సర్వే సూచించింది. అదే విధంగా 8వ తరగతి దాటిన విద్యార్థులను నిలుపుకోవాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పింది. ఓపెన్ స్కూలింగ్‌కు మద్దతు ఇచ్చింది. గ్రామీణ-పట్టణ పాఠశాల అసమానతలను, విధానపరమైన జోక్యాల అవసరాన్ని స్పష్టం చేసింది.

ఆర్టీఐపై పున :పరిశీలన అవసరం

దాదాపు రెండు దశాబ్దాల తరువాత ఆర్టీఐ చట్టాన్ని పున:పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. పున :పరిశీలించడమంటే, దాని స్ఫూర్తిని నీరుగార్చడం కాదని తెలిపింది. ప్రపంచ ఉత్తమ పద్ధతులతో దానిని అనుసంధానం చేయడానికి, అభివృద్ధి చెందుతున్న అంశాలను చేర్చడానికి, దాని అసలు ఉద్దేశానికి పున:పరిశీలన అవసరమని తెలిపింది.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

మొదటి తరువాయి

హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.÷ుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,అది ప్రజారోగ్య సూచీ, అది ఉత్పాదకత సూచీ మరియు అది ఆర్థిక సూచీ కూడా అన్నారు.2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందనీ, ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు. ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందనీ అన్నారు. ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోంది, అందుకే శుభ్రమైన గాలి గురించి మాట్లాడినప్పుడు, మనం మనుషుల జీవితాల గురించి,ఆర్థిక బలంపై, సామాజిక శ్రేయస్సు గురించి మాట్లాడుతున్నాం అన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం,కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాధారితమైన, శాస్త్రీయమైన విధానాన్ని అనుసరిస్తోంది అందులో భాగంగా మొదటి అంశం పర్యవేక్షణ అన్నారు. 2024లో గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను రెట్టింపు చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. దీని ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా అందుతుందని తెలిపారు.2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోంది. ఇది ఇప్పటికే అమలులో ఉందనీ తెలిపారు.

## అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

మొదటి తరువాయి

ప్రపంచ రాజకీయాల్లో చైనా, అమెరికా దేశాల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. చైనాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని అమెరికా.. అమెరికాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని చైనా పావులు కదుపుతున్నాయి. అమెరికా ఆధిపత్యం సాగిస్తున్న రంగాలపై చైనా దృష్టి సారించింది. అమెరికా కూడా అదే పని చేస్తోంది. ఒకే విధమైన ఆలోచనలు ఉన్న దేశాలను కలుపుకొని సెక్యూర్ ఏఐ ఎకోసిస్టమ్‌ను తయారు చేయాలని అమెరికా చూస్తోంది. సాధారణంగా అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ ఏపీఐలు, సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో ఆధిపత్యం కొనసాగిస్తున్న దేశాలే ప్రపంచ రాజకీయాల్లో పవర్‌ను కలిగి ఉంటాయి. భారత్ ఈ రెండు దేశాలపై ఆధారపడటం తగ్గించాలి. వస్తువులు లేదా సేవల విషయంలో ప్రత్యామ్నాయం లేని దేశంగా తప్పకుండా ఎదగాల్సిన అవసరం ఏంతైనా ఉంది. అలా చేయకపోతే ప్రపంచ రాజకీయాల్లో భారత్ పట్టు కోల్పోతుంది. అమెరికా, చైనాల మధ్య జరిగే గొడవల వల్ల భారత్ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. చైనా గనుక దిగుమతులపై ఆంక్షలు విధించినా లేదా ధరల్ని పెంచినా దాని ప్రభావం భారత తయారీ రంగంపై తీవ్రంగా ఉంటుంది.

## ఇది విచారణ కాదు.. ప్రతీకారం

మొదటి తరువాయి

తెలంగాణను అభివృద్ధిపథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్ అని వివరించారు. అడ్డగోలు హామీలు, అబద్ధాల పునాదుల మీద అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు నోటీసులిస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ ప్రజల్లో గుండెల్లో నిలిచిన నాయకుడనీ, నోటీసులు, బెదిరింపులో చరిత్రను చెరిపేయలేరని తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని, ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండించారు. ప్రజలపక్షాన వారి గొంతుక గా ఈ అన్యాయపాలనపై పోరాటం కొనసాగిస్తా మని తెలిపారు. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదనీ, ప్రజల తీర్పుతోనే రాస్తారని స్పష్టం చేశారు.

## గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం

మొదటి తరువాయి

నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేథస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

## అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు..

మొదటి తరువాయి

విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఎపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మరణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

## మేడారంలో కొలువుదీరిన వనదేవతలు

మొదటి తరువాయి

ముందుగా సమ్మక్కను సాయంత్రం 7:15 గంటలకు ప్రధాన పూజారి కొక్కర్ల కిష్టయ్య తీసుకొస్తూ చిలకలగుట్ట దిగగానే జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథన్ కేకన్ గాలిలో కాల్పులు జరిపి స్వాగతం పలికారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, అధికార యంత్రాంగం ఆదివాసీ ప్రజా ప్రతినిధుల మధ్య, పోలీసులు భారీ బందోబస్తు నడుమ సమ్మక్క ఆగమనం ప్రారంభమైంది. సమ్మక్కను వడ్డెలు తీసుకొస్తుండగా మహిళల నృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ ఈ కార్యక్రమం కొనసాగింది. రహదారికి అడ్డంగా కోళ్లు, గొర్రెలను బలిస్తూ స్వాగతం పలికారు. కాగా, నేడు(శుక్రవారం) తల్లుల దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడం తో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర మంత్రులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పొంగులేటి, అడ్లూరి గురువారం ఉదయం బైక్‌లపై ప్రయాణించి జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్‌తో కలిసి జంపన్న వాగు వద్ద భక్తుల స్నాన ఘట్టాలను, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, తప్పిపోయిన వారి కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు తగు సూచనలు చేస్తూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. అలాగే, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం మేడారం చేరుకున్నారు. వారికి రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డోలు, డప్పులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు తులాభారం వేయించుకున్నారు. కిషన్ రెడ్డి 75 కేజీలు, జువల్ ఓరం 86 కేజీల బంగారాన్ని అమ్మవార్లకు మొక్కుగా సమర్పించుకున్నారు.

## దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

మొదటి తరువాయి

ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

## ఫిబ్రవరి 12న జేఈఈ మెయిన్-1 ఫలితాలు

మొదటి తరువాయి

విద్యార్థుల రెస్పాన్స్‌షీట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఫైనల్ కీ ఖరారుచేసి, ఫిబ్రవరి 12 లోపు ఫలితాలు విడుదల చేయాలన్న ఆలోచనలో ఎన్టీఏ వర్గాలు ఉన్నాయి. ఈ పరీక్షలకు 13.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 95% మంది హాజరై ఉంటారని అంచనా.

## సంపాదకీయం

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం !




ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గు చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది.

# యూజీసీ కొత్త రూల్స్‌పై సుప్రీం కోర్టు స్టే..

### తిరోగమనం వైపు వెళ్తున్నామా అని ప్రశ్న



**మాస్కో-29జనవరి (మహాప్రభ)**
యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల విడుదల చేసిన కొత్త రూల్స్‌పై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. 'ఈక్విటీ రెగ్యులేషన్స్' పేరుతో యూజీసీ ఈ నెల 13న విడుదల చేసిన కొత్త నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా రూల్స్ అమలుపై స్టే విధిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ కేంద్ర ప్రభుత్వంతో పాటు యూజీసీకి నోటీసులు జారీ చేసింది.తాజా రూల్స్ స్పష్టంగా లేవని, ఇవి సమాజాన్ని విడదీసేలా లేదా సమాజంలో అలజడి సృష్టించే ప్రమాదం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. "75 ఏళ్ల స్వతంత్ర భారతంలో మనం వర్గాలులేని సమాజాన్ని నిర్మించామా.. లేక సమాజాన్ని మళ్లీ తిరోగమనం వైపు తీసుకెళ్తున్నామా..? తమ సంస్కృతిని పాటిస్తున్న దక్షిణాది వారిపై, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులపై ఇంకా ర్యాగింగ్ చేస్తున్నాం. వారిపై కామెంట్ చేస్తున్నాం. ఇంకా మీరు ప్రత్యేక హాస్టళ్ల గురించి అడుతున్నారు. అదృష్టవశాత్తు మన దేశంలో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. హాస్టళ్లలో అందరూ కలిసే ఉంటున్నారు. అమెరికాలోలాగా నల్లజాతీయులకు, శ్వేత జాతీయులకు వేర్వేరు పాఠశాలలున్నట్లు.. మనం విభజన కలిగిన పాఠశాలలవైపు వెళ్లడం లేదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో కొత్త రూల్స్ అమలు నిలిపివేసింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు 2012 నాటి పాత మార్గదర్శకాలే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూజీసీ న్యూ రూల్స్‌కు వ్యతిరేకంగా జనరల్ కేటగిరి విద్యార్థులు, పౌరులు ఉద్యమం చేస్తున్న సంగతి తెలిసిందే. రోహిత్ వేముల, పాయల్ తద్వి వంటి బలహీనవర్గాల విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో.. యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ,మహిళల రక్షణ కోసం యూజీసీ 'ఈక్విటీ రెగ్యులేషన్స్ 2026' పేరుతో కొత్త రూల్స్ తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటై.. వాటిలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సభ్యులు తప్పనిసరిగా ఉంటారు. అలాగే ఈ నిబంధనలు పాటించని యూనివర్సిటీలు, విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేస్తారు. అయితే, ఈ నిబంధనల వల్ల తమకు అన్యాయం జరుగుతుందని జనరల్ కేటగిరి విద్యార్థులు మండిపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారు. మరోవైపు ఈ రూల్స్‌ను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారు సమర్థిస్తున్నారు.


# ఆ సమయంలో జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం

### : ఆర్థిక సర్వే కీలక సూచన




**న్యూఢిల్లీ -29జనవరి (మహాప్రభ)**
ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అన్ని ప్రసార మాధ్యమాల్లో జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ఆర్థిక సర్వే సూచించింది. జంక్ ఫుడ్ ఉత్పత్తులపై అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంత వినియోగించారో హెచ్చరించేలా న్యూట్రిషన్ లేబుల్‌ను ముద్రించాలని సర్వే సూచించింది. అలాగే చిన్నారులు, పసిపిల్లల పాల ఉత్పత్తులు, పానీయాల మార్కెటింగ్‌పైనా ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఈ సర్వేలో అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార వినియోగాన్ని తగ్గించే అంశాలపై ప్రస్తావించారు. జంక్‌ఫుడ్‌గా పిలిచే బర్గర్, నూడుల్స్, పిజ్జా, సాఫ్ట్ డ్రింక్ వంటి పదార్థాల కారణంగా దీర్ఘకాల వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. "మన దేశంలో 2009 నుంచి 2023 మధ్య జంక్ ఫుడ్ వినియోగం 150 శాతానికి పైగా పెరిగింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల రిటైల్ విక్రయాలు విలువ 2006 లో 0.9 బిలియన్ డాలర్లు ఉండగా.. 2019 నాటికి అది 38 బిలియన్ డాలర్లకు (40 రెట్లు) పెరిగింది. మహిళలు, పురుషుల్లో ఒబెసిటీ సమస్య దాదాపు రెట్టింపు అయ్యింది. ఆహార వ్యవస్థలకు సంబంధించి పాలనపరమైన విధానాల్లోనూ మార్పులు రావాలి. జంక్ ఫుడ్ ఉత్పత్తి, మార్కెటింగ్‌ను నియంత్రించాలి" అని ఆర్థిక సర్వే పేర్కొంది.


# టెహ్రాన్‌పై దాడులు వద్దు : రష్యా హెచ్చరిక



**మాస్కో-29జనవరి (మహాప్రభ)**
టెహ్రాన్‌పై అమెరికా బలప్రయోగానికి పాల్పడితే చాలా ప్రమాదకర పరిణామాలు తలెత్తుతాయని.. పశ్చిమాసియా అంతటా గందరగోళానికి కారణమవుతుందని రష్యా హెచ్చరించింది. అమెరికా-ఇరాన్‌లు ఇంకా చర్చించుకునే అవకాశం ఉందని రష్యా సూచించింది. ఇరాన్ చర్చలకు వచ్చి అణ్వాయుధాలపై ఒప్పందం కుదుర్చుకోవాలని లేదా అమెరికా దాడి చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగారు. ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ స్పందించారు. ఈ సందర్భంగా డిమిత్రీ మీడియాతో మాట్లాడుతూ.. 'సమస్యల్ని పరిష్కరించడానికి అన్ని పక్షాలు సంయమనం పాటించాలి. బలప్రయోగాన్ని మానుకోవాలని మేము పిలుపునిస్తూనే ఉన్నాము. చర్చల విధానాలపైనే దృష్టి పెట్టాలి. బలవంతపు చర్యలు ఈ ప్రాంతంలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రాంతం అంతటా భద్రతా వ్యవస్థను అస్థిరపరిచే పరంగా చాలా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తాయి' అని ఆయన అన్నారు. కాగా, ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యా ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంది. జనవరి 2025లో ఇస్లామిక్ రిపబ్లిక్‌తో 20 సంవత్సరాల వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేసింది.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా పవార్ భార్య..

### ఎన్సీపీ కొత్త బాస్ ఆయనేనా..!



**న్యూఢిల్లీ -29జనవరి (మహాప్రభ)**
మహారాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ని నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు పవార్ స్థానాన్ని ఆశిస్తున్నారు. అయితే.. కొందరు సీనియర్ నాయకులు మాత్రం ఆయన భార్య సునేత్ర పవార్ పేరును ప్రతిపాదిస్తున్నారు. అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని, అందుకని ఆమెను ఉపముఖ్యమంత్రిగా చూడాలని వారందరూ ఆశపడుతున్నారు.జడ్జీ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బారామతిలో విమానం కుప్పకూలడంతో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం చెందారు. రాజకీయ చతురుడిగా పేరున్న అజిత్ మరణంతో ఎన్సీపీ నుంచి ఉప ముఖ్యమంత్రి పదవి కోసం పలువురు అశావహులు పోటీలో ఉన్నారు. కానీ, సీనియర్లు అజిత్ భార్య సునేత్ర వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్న ఆమెను డిప్యూటీ సీఎం చేయాలనుకుంటున్నారు. ఎన్సీపీ నాయకుడు, మంత్రి నరహరి జిర్వాల్ గురువారం పీటీఐతో మాట్లాడుతూ.. 'సునేత్రను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నార'ని తెలిపాడు.ఇప్పటికే సీనియర్లు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, ధనంజయ్ ముండు, సునీల్ తట్కరేలు సునేత్రను పరామర్శించి భవిష్యత్ ప్రణాళికలపై మంతనాలు జరిపారు. అజిత్ పవార్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైన బారామతి నియోజకవర్గం నుంచి సునేత్రను బరిలో ఉంచాలని.. ఆపై ఆమెకు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టాలని వారు భావిస్తున్నారు. ఎన్సీపీ సీనియర్లు త్వరలోనే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి ఆయనతో ఇదే విషయమై చర్చించేందుకు సిద్ధమౌతున్నారు.

**పార్టీ అధ్యక్షుడిగా ప్రఫుల్?**
రాబోయే మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా ఎన్సీపీ(ఎస్పీ)తో అజిత్ పవార్ సంప్రదింపులు జరిపారు. ఇప్పుడు ఆయన మరణంతో ఏర్పడిన శూన్యతను భర్తీ చేసే నాయకుడి అవసరం ఎన్సీపీకి ఎంతో ఉంది. దాంతో ప్రస్తుతం ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ప్రఫుల్ పటేల్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకొనే అవకాశముంది.జనవరి 28న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఇద్దరు పైలట్లు, ఫ్లైట్ సహాయకురాలు, పవార్ వ్యక్తిగత సహాకుడు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్.

**మెదక్ జిల్లా–జనవరి 29 (మహాప్రభ)**




మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ నర్సాపూర్ నామినేషన్ కేంద్రం పరిశీలన

నామినేషన్ ప్రక్రియ రెండవ రోజు కొనసాగుతున్న సందర్భంగా,గురువారం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ నర్సాపూర్ పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా కొనసాగేందుకు తీసుకున్న భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణంలో మొత్తం 12 వార్డులు, 24 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేయడంతో మంచి ఓటింగ్ శాతం నమోదైందని గుర్తు చేశారు. అలాగే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.నామినేషన్ కేంద్రం పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను దూరంగా పార్క్ చేయాలని సూచించారు. ఎన్నికల అధికారులు, పోలీసుల సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని అదనపు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.అదనపు ఎస్పీ వెంట నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, నర్సాపూర్ ఎస్సై రంజిత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# శివ్వంపేట్ పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్.



**మెదక్ జిల్లా–29జనవరి (మహాప్రభ)**

మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ శివ్వంపేట్ పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, వాటి నమోదు, భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతి, విధుల నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, శుభ్రత, భద్రతతో పాటు ప్రజలకు అనుకూల వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని తెలిపారు. చట్టం వ్యవస్థల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీ అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో శివంపేట్ ఏఎస్ఐ సాయిలు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంటను కవితలు మర్యాదపూర్వం కలిసిన మెదక్ యూత్ కుమార్.



**మెదక్ జిల్లా –29జనవరి (మహాప్రభ )**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను వారి స్వగృహంలో మెదక్ యూత్ ఐకాన్ లీడర్ ఏలేశ్వరా భువన కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా నిలబడుతున్నానని వెళ్లి కవితను కలవడంతో జాగృతి తరపున నిలబడుమని వారు తెలిపారని అన్నారు. మెదక్ నుండి తన పార్టీ సింబల్ అయిన పులి గుర్తు పై నిలబడాలని మరియు నామినేషన్కు ఎవరైనా ముందుకు వస్తే తాను బీఫామ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. హైదరాబాదులో జరిగిన ఈ కార్యక్రమంలో భువన్ కుమార్ తో పాటు పార్టీ నాయకులు అశోక్ యాదవ్ మరియు జాగృతి సభ్యులు పాల్గొన్నారు. భువన్ కుమార్ తో పాటు మరికొందరికి మెదక్ పట్టణ మున్సిపాలిటీ లో కౌన్సిలర్ స్థానాల్లో నిలబెట్టుకోవాలని కవిత సూచించారని తెలిపారు.

# రైతులకు భూతగాదాలు లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

-పక్కగా భూమి యొక్క నక్ష,మ్యాప్,హద్దుల నిర్ణయం.
-భూమి ఆక్రమణలకు తావు లేకుండా
భూ భారతి భూ రీసర్వే కార్యక్రమం
-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.




**మెదక్ జిల్లా–29జనవరి (మహాప్రభ)**

జిల్లాను భూ తగాదాలు లేనీ జిల్లాగా తీర్చిదిదలని,ప్రతి భూ కమతానికి సరైన నక్షను,మ్యాప్ ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్ లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,అదనపు కలెక్టర్ నగేష్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు.పాషాపూర్ గ్రామంలో భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించుకోవడనికి గ్రామ సభ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. భూ భారతి భూముల రీసర్వే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు పక్కగా భూ హద్దులు, భూమి యొక్క నక్ష, మ్యాప్ లను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులను తయారు చేయడమే అని అన్నారు. ప్రతి కమతానికి రీసర్వే చేసి రైతులకు భూ తగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. డిజిటల్ సర్వే తో హద్దుల నిర్ణయించి ,అక్షాంశ రేఖాంశాలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే తో భూ హద్దులు చెరిగి పోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉంటుందన్నారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లిన లేదా విదేశాల్లో సైతం తన భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు.తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భుముల రీసర్వే చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్... ప్రజలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై యువతకు బిఎఫ్ఎల్ అవగాహన డ్రైవ్

**నిజామాబాద్, –జనవరి 29 (మహాప్రభ)**




డిజిటల్ వినియోగదారులను పెరుగుతున్న సైబర్ ముప్పులు, తమ ఆర్థిక వ్యవహారాలను ఎలా సురక్షితంగా ఉంచుకోవాలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్(బిఎఫ్ఎల్), భారత దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ(ఎన్.బీ.ఎఫ్.సీ), బజాజ్ ఫిన్సర్వ్ గ్రూప్‌లో భాగమైన సంస్థ నిజామాబాద్‌లో 'నాక్అవుట్ డిజిటల్ ఫ్రాడ్' పేరుతో సైబర్ మోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ మొకీద్ పాషా, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బసవరాయ మానోహర, ఎస్ఎస్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ ఎం.మరయ్య గౌడ్‌తో పాటు అధ్యాపకులు హాజరై నకిలీ ఓటీపీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్, లోన్ మోసాలు, పెన్షన్ మోసాలు తదితర ఆర్థిక మోసాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించినట్లు చెప్పారు.

# మెదక్ మున్సిపల్ ఎన్నికల పరిశీలకులుగా టి. రవికిరణ్




**మెదక్ జిల్లా–29జనవరి (మహాప్రభ)**

ఎన్నికల నియమాల్లో భాగంగా మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి రవి కిరణ్ ఐఎఫ్ఎస్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి రవి కిరణ్ కు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల తీరును, మున్సిపాలిటీలను, మున్సిపాలిటీలో వార్డుల గురించి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సాధారణ పరిశీలకులు రవి కిరణ్ కు వివరించారు. సాధారణ పరిశీలకులు మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో జరిగే ఎన్నికల సరళిని పరిశీలించనున్నారు. అనంతరం మెదక్ మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు సిబ్బంది ఉన్నారు.

# మైనంపల్లి రోహిత్ సహకారంతో 29వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొద్దుల కృష్ణ నామినేషన్

29వ వార్డు వదుల కృష్ణ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ సమర్థించిన బొద్దుల కృష్ణ



**మహాప్రభ –29 జనవరి – మెదక్ జిల్లా ప్రతినిధి**



మెదక్ జిల్లా 29వ వార్డు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ప్రజల కోసం నా ప్రాణమైన ప్రాణంగా పెట్టి అభివృద్ధి దిశలో 29వ వార్డుని కాకుండా ప్రజల కోసం ఎక్కడికైనా వెళ్తానని 29వ వార్డు అభ్యర్థి బొద్దుల కృష్ణ నామినేషన్ వేశారు,అనంతరం మెదక్ మున్సిపల్ ఆవరణంలో ప్రజలకు అభినందనలు తెలియజేస్తూ 29వ వార్డులో నన్ను గెలిపించండి ప్రతి సమస్య ప్రజా నాయకుడిగా ఉండి కాంగ్రెస్ పార్టీ పథకాలను ఇంటింటికి చేరవేస్తానని ఆయన అన్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనాంపల్లి రోహిత్ రావు సహకారంతో 29 వ వార్డులో ఏ సమస్య ఉన్న పేదలకు అండగా ఉంటానని నిరుపేదల పెనిధిగా అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన తెలియజేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో 29వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు ఈ కార్యక్రమంలో భాగంగా నామినేషన్ వేసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ మా వార్డులో ఉన్న అటువంటి సమస్యలను ఎమ్మెల్యేగా దృష్టికి తీసుకెళ్లి ప్రతి ఒక్క సమస్యను నా సమస్యగా భావించి ఎల్లవేళలా ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని బోదుల కృష్ణ తెలియజేయడం జరిగింది.

# ఐఏఎస్ హోదా పొందిన రెవెన్యూ అధికారి

**కరీంనగర్ –జనవరి 29 (మహాప్రభ)**

ఇటీవల పదోన్నతి పొంది ఐఏఎస్ హోదా పొందిన కరీంనగర్ జిల్లా రెవెన్యూ అధికారి బి. వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి, డిఆర్ఓ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

## మహనీయుల చిత్రపటాలు ఆవిష్కరించిన మంత్రి పున్నం ప్రభాకర్



**హుస్నాబాద్ ,-జనవరి 29 (మహాప్రభ)**

చిగురుమామిడి మండలం గునుకులపల్లె గ్రామపంచాయతీ స్టోర్ రూమ్‌లో మహనీయుల చిత్రపటాలు రెండేళ్లుగా నిర్లక్ష్యంగా మూలుగుతున్నాయి. నూతన గ్రామపంచాయతీ ప్రారంభం రోజున మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30 చిత్రపటాలను చైర్మన్, సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి అందజేశారు.అయితే అప్పటి నుంచి నేటి వరకు వాటిని గోడలపై అమర్చకుండా స్టోర్ రూమ్‌లోనే ఉంచడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కూడా చిత్రపటాలను బయటకు తీయకపోవడం ప్రజల్లో ఆవేదన కలిగించింది.మహనీయుల చిత్రపటాలను విస్మరించడం జాతీయ నేతలకు అవమానమని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ట్రస్టు ప్రతినిధులు ఇది యాదృచ్ఛికమా లేక కావాలనే చేస్తున్నారా అనే అనుమానాలను వ్యక్తం చేస్తూ, ఇప్పటికైనా మహనీయులను గౌరవించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా రాజీవ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**నర్సంపేట,-జనవరి 29 (మహాప్రభ)**

హన్మకొండ రాజీవ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు బాల్నే భరత్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత - మహేందర్ రెడ్డి హాజరయ్యారు. డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిరోజు వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, బహిరంగ ప్రదేశాల్లో నడవడం వలన శరీరంలో విటమిన్ 'డి' స్థాయి పెరుగుతుందని తెలిపారు. కొత్త సంవత్సరంలో డైరీ ఆవిష్కరణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ రామచంద్ర రావు, ట్రెజరర్ శ్రీనివాసులు, కాలనీ డెవలప్మెంట్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, సెక్రటరీ నారాయణ, పుల్లూరి సుధాకర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ వేముల సాంబయ్య, కె. శోభారాణి, బి. రాంచందర్, పి. ఉపేందర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన




**బల్మూరు, -జనవరి 29 (మహాప్రభ)**

బల్మూరు మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. అనంతవరం, కొత్తపల్లి గ్రామాల్లో పాఠశాల నూతన భవనం, గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేసి ప్రజలకు అభివృద్ధి పనులు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్ గౌడ్, సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ సభ్యుడు నిరంజన్ గౌడ్, డీసీసీ కార్యదర్శి కష్ణన్న యాదవ్, మాజీ సర్పంచులు నర్సింగరావు, ఎల్లికంటి శ్రీనివాసులు, మురళి, సర్పంచులు లక్ష్మమ్మ, రామచంద్రారెడ్డి, రాధాకృష్ణ, ఎల్లస్వామి, సురేష్, ఇందిరమ్మ, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శివ గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఖదీర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణ నాయక్, పద్మయ్య, ఏంఆర్ఓ శ్రీకాంత్, ఏంపీడీఓ రాఘవులు, మండల ఉపాధ్యక్షుడు మషన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మహాప్రభ - జనవరి 29 - మెదక్ జిల్లా**





నారాయణఖేడ్ నియోజకవర్గం లోని వెంకటాపూర్ గ్రామంలో ఈరోజు స్కూల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ లో 47 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యాయి నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరిన లిగౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి, మీడియా తో మాట్లాడుతూ.... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసమర్థ ఎంపీ మరియు ఎమ్మెల్యే ఈ నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారాని నియోజకవర్గంలో పూట పూట ప్రతి పాఠశాలలో రెసిడెన్షియల్ స్కూళ్లలో ఫుడ్ పాయిజన్ జరుగుతున్న ఈ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు అని అన్నారు,వీళ్లకు విద్యార్థుల ప్రాణాల కంటే వాళ్ల జెబుల్లో డబ్బులు నింపుకోవడం ముఖ్యమని. గతంలో ఇదే వెంకటాపూర్ గ్రామంలో అంగన్వాడి భవనం పై పెచ్చు పడి విద్యార్థులకు తీవ్ర గాయాలు అయినాయని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి ఉండి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ పూర్తిగా విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో ఎంపీ మరియు ఎమ్మెల్యే ఉండి విద్యార్థులు గురించి విద్యా వ్యవస్థ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మనూర్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు పటేల్, సర్పంచ్ వెంకటేశం,మాజీ సర్పంచులు సంగప్ప, సాయిలు, రాజు నాయక్, మండల పార్టీ యువత అధ్యక్షులు మచ్చేందర్ ముదిరాజ్, నాయకులు సత్యం, సాయిలు,రాములు, చింటూ నరేష్, రాములు, అంబదాస్, లక్ష్మణ్, శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

### కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ -జనవరి 29 (మహాప్రభ)**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించిన ఆమె, హెల్ప్‌డెస్క్, పోలీస్ బందోబస్తు, సిబ్బంది విధులను సమీక్షించారు. అభ్యర్థుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, టీ.పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు.కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, సీసీ కెమెరాల ద్వారా విధులను పర్యవేక్షించాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి 24 గంటలు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమైన సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కూడా ఆమె పరిశీలించారు. హెల్ప్‌డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో జిల్లా కేంద్రానికి రిపోర్టులు పంపాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరగాలని సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మను పలు ప్రాంతాలలో దర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్





**కరీంనగర్/ హుస్నాబాద్, -జనవరి 29 (మహాప్రభ)**

మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.జాతర సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, వనదేవతల ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని, పేదల కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని ప్రార్థించారు.తరువాత కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తి గ్రామంలో కూడా సమ్మక్క సారలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మక్క సారలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. స్థానిక నాయకులు కలిసి జాతర ఘనంగా నిర్వహించారు. గద్దెలపైకి అమ్మవార్లు వచ్చే ముందు ఫైరింగ్ సంప్రదాయం ఇక్కడ 20 సంవత్సరాల క్రితం వరకు కొనసాగిందని, భక్తుల మనో విశ్వాసం, సంప్రదాయంగా ప్రభుత్వం అనుమతితో ఈరోజు కూడా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారని, ఈ ప్రాంతమంతా సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. భీమదేవరపల్లి, ఎలకతుర్తి మండలాల రైతులు, అంజి వర్గాల ప్రజలు మంచిగూడాలని, సంక్షేమ పథకాలు కింది స్థాయి ప్రజల వరకు ఎలాంటి ఆటంకం లేకుండా చేరాలని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు అమలు చేసే శక్తిని ప్రభుత్వం పొందాలని అమ్మవారిని కోరుకున్నారు.

# బిజినెస్

## మరింత వేగంగా వెండి పరుగులు..
# రూ.4 లక్షలు దాటిన కిలో ధర

దేశీయంగా బంగారం , వెండి ధరలు మరింత వేగంగా పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర దాదాపు రూ.2 లక్షలకు చేరువ కాగా.. వెండి ధర ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఏకంగా రూ.4 లక్షలు దాటి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. హైదరాబాద్ లో గురువారం ఉదయం 10 గంటల సమయంలో 24 క్యారెట్స్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,85,000 దాటింది. వెండి ధర (రాఅశ్రీజవతీ =ఞ్వ) రూ.4 లక్షల మార్కును దాటేసింది.బుధవారం రాత్రి హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్స్ బంగారం ధర రూ.1,73,300 గా ఉంది. కొన్ని గంటల్లోనే రూ.12 వేలు పెరిగింది. బుధవారం కిలో వెండి ధర రూ.3,79,700 వద్ద ముగియగా.. ఇవాళ ఏకంగా రూ.21 వేలకుపైగా పెరిగి రూ.4 లక్షల మార్కును దాటింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి డెలివరీ



కాంట్రాక్టుకు ఫ్యూచర్స్‌లో వెండి ధర గురువారం ఒక్కరోజే రూ.22,090 కి పెరిగి రూ.4,07,456 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. ఔన్స్ వెండి ధర తొలిసారి 5,600 డాలర్ల మార్క్ దాటింది. కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ డెలివరీకి ఔన్సు ధర రూ.5,626.8 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర రూ.119.51 డాలర్లకు చేరింది. అమెరికా డాలర్ విలువ బలహీనపడటం, వెండికి పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వైట్ గోల్డ్‌కు రెక్కలొచ్చాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు .కాగా అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనంగా మదుపర్లు భావిస్తున్నారు. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతోంది

## నీటి బుడగ పేలినట్లు క్షణాల్లో పడిపోయిన వెండి ధరలు..రూ.65,000వేల కంటే ఎక్కువ..



కమోడిటీ మార్కెట్ (జనవరి 29 సాయంత్రం)ఒక అరుదైన సంఘటనను చూసింది. వెండి ఒక్క రోజులోనే ఆకాశం నుండి నేలకు పడిపోయింది. ప్రారంభంలో దాని ప్రకాశం పెట్టుబడిదారులను ఆనందపరిచింది. రికార్డు గరిష్టాలను చేరుకుంది. కానీ, నిమిషాల్లోనే ధరల వేగం సునామీలా రూ.65,000 కంటే ఎక్కువ తగ్గించింది. ప్రస్తుతం, వీజశలో వెండి కిలోకు రూ.3,97,428 వద్ద ట్రేడవుతోంది. వెండి ధర ఒక్క గంటలోనే రూ.65,000 తగ్గి, కిలోకు రూ.4.20 లక్షల నుండి రూ.3.55 లక్షలకు పడిపోయింది. అయితే, తరువాత కోలుకుంది. రాత్రి 8గంటల సమయానికి దాని ధర రూ.3.96 లక్షల వద్ద ట్రేడవుతోంది.

**అసలు విషయం ఏమిటి?**

గురువారం మార్కెట్ ప్రారంభమైన వెంటనే వెండి ధరలు అనూహ్యంగా పెరిగాయి. డిమాండ్ చాలా పెరిగి వెండి కొత్త గరిష్టాలను చేరుకుంది. కానీ, పెట్టుబడిదారులు వెండి చరిత్ర సృష్టిస్తుందని భావించినట్లే, గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో లాభాల బుకింగ్ అకస్మాత్తుగా ఈ రికార్డు ధరలపై ప్రభావం చూపింది. కొన్ని క్షణాల క్రితం విపరీతంగా పెరిగిన వీజశలో వెండి ధరలు రెప్పపాటులో తగ్గడం ప్రారంభించాయి. కొన్ని సెకన్లలోనే వెండి ధరలు కిలోకు రూ.65,000 కంటే ఎక్కువ తగ్గాయి. ఈ ఆకస్మిక పతనం ఇంట్రా-డే ట్రేడర్లు, పెట్టుబడిదారులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

# రికార్డు స్థాయిలో రూపాయి పతనం!

### డాలర్‌తో పోలిస్తే దాదాపు రూ.92కు..

**ఇంటర్నెట్ డెస్క్:** భారత కరెన్సీ విలువ భారీగా పతనమైంది. గురువారం ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 91.98కు పడిపోయి జీవితకాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. స్పాట్ మార్కెట్‌లో రూపాయి విలువ ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 శాతం మేర పతనమైంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ చూస్తే ఏకంగా 5 శాతం మేర రూపాయి విలువ తగ్గింది. దేశఆర్థికాభివృద్ధి అంచనాలకు మించుతున్నా రూపాయి విలువ పతనం కావడం చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో భారత దేశ జీడీపీ 8.2 శాతం



మేర పెరిగిన విషయం తెలిసిందే . అయితే, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. 92 మార్కు కీలక నిరోధం కావడంతో ఈ స్థాయికి మించి పడిపోకుండా ఆర్‌బీఐ చర్యలు తీసుకోవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, రూపాయి విలువను నిర్దిష్ట స్థితికి పరిమితం చేయాలనే టార్గెట్స్ ఏవీ లేవని ఆర్బీఐ గతంలోనే ప్రకటించింది.


**రూపాయి క్షీణతకు కారణాలు**

రూపాయి పతనానికి పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అమెరికా విధించిన అధిక సుంకాలు, స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ నిధులు తరలిపోవడం, భారీ స్థాయిలో బంగారం దిగుమతులు, కరెన్సీ మరింత పతనం అవుతుందన్న భయాలు వెరసి రూపాయి క్షీణతకు దారి తీస్తున్నాయి. ఇటీవలే ఈయూతో వాణిజ్య ఒప్పందం కుదిరినా సానుకూల సెంటీమెంట్ బలపడకపోవడం కొసమెరుపు. అమెరికా సుంకాలు అమల్లోకి వచ్చిన నాటి నుంచి భారత కరెన్సీ 7.5 శాతం మేర క్షీణించింది. చైనా కరెన్సీ యువాన్‌తో పోలిస్తే రూపాయి విలువ 7.5 శాతం మేర పతనమైంది. అమెరికా సుంకాల తగ్గుదలలో జాప్యం కారణంగా రూపాయి విలువపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అధికారులు చెబుతున్నారు. రాబోయే 12 నెలల్లో డాలర్‌లో పోలిస్తే రూపాయి మారకం విలువ 94కు కూడా పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు.

# స్పోర్ట్స్

## వరల్డ్‌కప్‌ను బాయ్‌కాట్ చేసేంత ధైర్యం పాకిస్థాన్‌కు లేదు.. ఎందుకంటే..?!

పొట్టి ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ వైదొలగగా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కొత్త నాటకానికి తెరతీసింది. మా ప్రభుత్వం అనుమతిస్తేనే వరల్డ్‌కప్ ఆడుతామంటూ పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. అయితే.. పాక్ బోర్డు బాయ్‌కాట్ వార్తలను భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహానే ఖండించాడు. పాక్ బోర్డు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని, వరల్డ్‌కప్‌ను బాయ్‌కాట్ చేసేంత దమ్ము, ధైర్యం ఆ దేశానికి లేవని రహానే అన్నాడు.ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ పీసీబీ చీఫ్ బెదిరింపులను టీమిండియా మాజీ ఆటగాడు అజింక్యా రహానే కొట్టిపారేశాడు. గురువారం క్రిక్‌బజ్‌తో మాట్లాడిన అతడు 'పాకిస్థాన్ జట్టు వరల్డ్‌కప్ బాయ్‌కాట్ చేస్తుందని నేను అనుకోవడం లేదు. మెగా టోర్నీ నుంచి వైదొలిగేంత దమ్ము, ధైర్యం ఆ దేశ బోర్డుకు లేవు. ఇప్పటికే షెడ్యూల్ ఖరారావ్వడంతో పాటు ఒప్పందం ప్రకారం ఆ జట్టు మ్యాచులన్నీ శ్రీలంకలోనే ఉన్నాయి. సో.. బాయ్‌కాట్‌కు సిద్ధపడుతుందని నేను భావించను. అన్ని జట్లలానే పాక్ కూడా వరల్డ్‌కప్ కోసం వస్తుంది' అని



పేర్కొన్నాడు. ఒకప్పుడు టీమిండియాలో కీలక ఆటగాడైన రహానే ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ షురూ కానుంది. భద్రతా కారణాలరీత్యా ఇండియాలో ఆడబోమని బెట్టు చేసిన బంగ్లాదేశ్‌కు షాకిచ్చిన ఐసీసీ గ్రూప్ -సీలో స్కాట్లాండ్‌కు చోటు కల్పించింది. బంగ్లాపై వేటు పడడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ మా జట్టు సైతం ప్రపంచకప్ ఆడుతోందో లేదో తెలియదు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే మేము ఆడుతాం అని కామెంట్ చేశాడ. ఆ మరునాడే పాక్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. దాంతో, మెగా టోర్నీలో పాక్ ఆడడం పక్కా అనిపిస్తోంది. కానీ, తాము వరల్డ్‌కప్‌లో ఆడుతామా? లేదా? అనే విషయాన్ని జనవరి 30న లేదా ఫిబ్రవరి 2న వెల్లడిస్తామని నఖ్వీ పేర్కొన్నాడు.

**శ్రీలంకలోనే..**

భారత్, పాక్ క్రికెట్ బోర్డుల మధ్య సఖ్యత లేనందున ఇరుజట్ల మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహిస్తున్నారు. ఈసారి వరల్డ్‌కప్‌లోనూ పాకిస్థాన్ అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనే ఆడనుంది. డిసెంబర్ 2024లో పీసీబీ, బీసీసీఐ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కొలంబో, పల్లెకెలె స్టేడియాల్లో పాక్ జట్టు మ్యాచ్‌లు ఉంటాయి. గ్రూప్ ఏలో ఉన్న చిరకాల ప్రత్యర్థులు జనవరి 15న కొలంబోలో ఢీకొననున్నాయి. నిరుడు ఆసియా కప్ ఫైనల్ తర్వాత దాయాదుల మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ ఇదే.

## జింఖానాలో చెలరేగిన సిరాజ్.. ఓపెనర్ల జోరుతో పటిష్ట స్థితిలో హైదరాబాద్..!

టీమిండియా పేసర్ సిరాజ్ దేశవాళీ క్రికెట్‌లో చెలరేగిపోయాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ డీ మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ బ్యాటర్లకు వణికిస్తూ వికెట్ల వేటతో హైదరాబాద్‌కు బ్రేకిచ్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు(4-56) తీసి ప్రత్యర్థిని ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు మియా భాయ్. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ వికెట్ పడకుండా 56 పరుగులు చేసింది.రంజీ ట్రోఫీలో భాగంగా ఎలైట్ డీలోని ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో సిరాజ్ రెచ్చిపోయాడు. జింఖాన మైదానంలో తన తడాఖా చూపిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడీ స్పీడ్‌స్టర్. ఓపెనర్ అనుజ్ తివారీ(4)ను ఔట్ చేసి తొలి బ్రేకిచ్చిన సిరాజ్. ఆ తర్వాత సంజీత్ దేశాయ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ప్రతీక్ యాదవ్(106)తో కలిసి




జట్టును ఆదుకున్న వికల్ప్ తివారీ(94)ని సైతం వెనక్కి పంపిన అతడు.. టెయిలెండర్ ఆదిత్య సర్వాతే(4)ను ఔట్ చేసి నాలుగో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. సీటీఎల్ రక్షణ్(2-28) రెండు వికెట్లతో రాణించగా ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 283 కే ఆలౌటయ్యింది.ప్రతీక్ సెంచరీ, వికల్ప్ అర్ధ శతకంతో భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లిన ఛత్తీస్‌గఢ్‌ను మూడొందలలోపే కట్టడి చేసిన బౌలర్ల కృషిని బ్యాటర్లు వృథా కానివ్వలేదు. ఓపెనర్లు అమన్ రావు పెరాల(32 నాటౌట్), అభిరత్ రెడ్డి(23 నాటౌట్)లు అదిరే ఆరంభమిచ్చారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 56 రన్స్ చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 227 పరుగులు వెనకబడి ఉంది.

## డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఆర్సీబీ..!

### చితక్కొట్టిన హ్యారిస్, మంధాన..

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ ఆపై రెండు ఓటముల నుంచి తేరుకొని యూపీ వారియర్స్‌పై పంజా విసిరింది. 149 పరుగుల ఛేదనలో ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(75) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. స్మృతి మంధాన(54 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. దాంతో, 8 వికెట్ల తేడాతో గెలుపొందిన బెంగళూరు 12 పాయింట్లతో నాలుగో




సీజన్ ఫైనల్లో అడుగుపెట్టింది.డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. నాలుగో సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ.. లీగ్ దశ చివరి పోరులోనూ చెలరేగింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతూ యూపీ వారియర్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 149 పరగుల మోస్తరు ఛేదనలో గ్రేస్ హ్యారిస్(75), స్మృతి మంధాన(54 నాటౌట్)ల విధ్వంసంతో యూపీ బౌలర్లు నీరుగారిపోయారు.హ్యారిస్ ఔటయ్యాక మరింత జోరు పెంచిన మంధాన.. శోభన ఓవర్లో భారీ సిక్సర్ బాదిన మంధాన.. సింగిల్ తీసి 26 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకుంది. విజయానికి 9 పరుగుల దూరంలో జార్జియా వోల్(16) బంతిని అంచనా వేయలేక సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన రీచా ఘోష్(0 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేసింది కెప్టెన్. 13.1 ఓవర్లోనే ఛేదించి యూపీకి దిమ్మతిరిగే షాకిచ్చిన బెంగళురు 12 పాయింట్లతో ఫైనల్ బెర్తు పట్టేసింది.డీ క్లెర్క్ దెబ్బకొట్టింది

ప్లే ఆఫ్స్ చేరాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. పవర్ ప్లేలోనే వికెట్లు తీసి ఒత్తిడి పెంచే లారెన్ బెల్‌ను దీటుగా ఎదుర్కొన్న మేగ్ లానింగ్(41), దీప్తి శర్మ(55)లు ధనాధన్ ఆడారు. తొలి వికెట్‌కు 74 రన్స్ జోడించి భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ ద్వయాన్ని నడినే డీ క్లెర్క్ (4-22) విడదీసిది.డేంజరస్ లానింగ్‌ను పెవిలియన్ పంపిన తను.. అమీ జోన్స్(1)ను ఔట్ చేసి మరో బ్రేకిచ్చింది. ఆ తర్వాత వచ్చినవాళ్లేవరూ క్రీజులో నిలువలేదు. అర్ధ శతకంతో యూపీ స్కోర్ 130 దాటించిన దీప్తిని శ్రేయాంక పాటిల్ వెనక్కి పంపింది. ఆ తర్వాత పరుగుల చేసేవారు కరువవ్వడంతో యూపీ నిర్ణీత ఓవర్లలో 148కే పరిమితమైంది.




## ఓటీటీలోకి వచ్చేసిన వరుణ్ సందేశ్

# ‘కానిస్టేబుల్’..స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

యంగ్ హీరో వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ ‘కానిస్టేబుల్’ ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. గతేడాది అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘ఈటీవీ విన్’లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శంకరపల్లి అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. వరుస హత్యలు ఆ ఊరిని వణికిస్తుంటాయి. ఈ క్రమంలోనే అక్కడ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కాశీ (వరుణ్ సందేశ్) మేనకోడలు కూడా దారుణ హత్యకు గురవుతుంది. తన సొంత మనిషిని కోల్పోయిన బాధలో ఉన్న కాశీ, ఆ సీరియల్ కిల్లర్ గుట్టును ఎలా రట్టు చేశాడు? ఆ హంతకుడి వెనుక ఉన్న అసలు రహస్యాలేమిటి? అనే ఉత్కంఠభరిత అంశాలతో ఈ చిత్రం రూపొందింది.







# ఆసక్తికరంగా ‘శ్రీ చిదంబరం గారు’ ట్రైలర్

### మెల్లకన్ను బాధను బలంగా చూపిస్తూ..

టాలీవుడ్ నుంచి మరో వినూత్న కథాంశంతో తెరకెక్కిన సినిమా రాబోతుంది. యువ నటీనటులతో ‘శ్రీ చిదంబరం గారు’ అంటూ ఈ చిత్రం రాబోతుండగా.. సాధారణంగా సినిమాల్లో శారీరక లోపాలను కేవలం హాస్యం కోసమే వాడుకుంటారు కానీ ఈ చిత్రంలో మెల్లకన్ను ఉన్న ఒక యువకుడు సమాజంలో ఎదుర్కొనే అవమానాలు, అతనిలో ఉండే ఇన్సెక్యూరిటీలు, అతని భావోద్వేగపూరితమైన ప్రేమకథను దర్శకుడు వినయ్ రత్నం చాలా హృద్యంగా ఆవిష్కరించారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ‘ఉప్పెన’, ‘పెద్ది’ చిత్రాల దర్శకుడు బుచ్చిబాబు సానా లాంచ్ చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు.మెల్లకన్ను కారణంగా తన లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎప్పుడూ కళ్ళద్దాలు ధరించే కథానాయకుడు, ఒక అమ్మాయితో ప్రేమలో పడిన తర్వాత తన బలహీనతను ఎలా అధిగమించాడనేది ఈ సినిమా ప్రధానాంశం. హీరో వంశీ తుమ్మల ఈ పాత్ర కోసం ప్రత్యేకమైన మేనరిజమ్స్‌తో కష్టపడగా, సంధ్యా వశిష్ట కథానాయికగా ఆకట్టుకున్నారు. ఈ చిత్రం గురించి బుచ్చిబాబు మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయే నేటి యువతకు తమ లోపాన్నే బలంగా మార్చుకోవాలని చెప్పే ఒక నిజాయితీ గల స్ఫూర్తిదాయకమైన ప్రయత్నమని ప్రశంసించారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని చింతా వినీషా రెడ్డి మరియు చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు. చందు రవి సంగీతం అందించిన ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి గారు ఒక పాట పాడటం విశేషం. “నీ లోపం నీకు బలహీనత కాకూడదు, అది నీ బలం అవ్వాలి” అనే చక్కని సందేశంతో వస్తున్న ఈ గ్రామీణ ప్రేమకథ ఫిబ్రవరి 6 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



# రాధికకు ఆఫర్స్ రావడం లేదా.? లేక కావలనే బ్రేక్ తీసుకుంటుందా.?

నేహా శెట్టి.. ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో కనిపించి చాలా రోజులు అయిపోయింది. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. నేహా శెట్టి 2016లో కన్నడ సినిమా ముంగారు మలే 2తో సినీరంగంలోకి ఆడుగుపెట్టింది. ఆతర్వాత టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ.తెలుగులో మెహబూబా, గల్లీ రౌడీ, డీజే టిల్లు సినిమాలతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. పూరీజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన మెహబూబా సినిమాతో ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిన ఈ భామ అందానికి మంచి మార్కులు పడ్డాయి.మోడలింగ్ లోకి వచ్చిన నేహా, 2014లో మిస్ మంగళూరు అందాల పోటీతో గెలిచింది. మిస్ సౌత్ ఇండియా 2015 రన్నరప్‌గా నిలిచింది. తెలుగులో మెహబూబా, గల్లీ రౌడీ, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, డిజే టిల్లు, బెదురులంక 2012, రూల్స్ రంజన్, టిల్లు స్క్వేర్, గ్యాంగ్స్ అఫ్ గోదావరి సినిమాల్లో నటించింది.టిల్లు స్క్వేర్‌లో చిన్న పాత్ర చేసింది. అలాగే పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ ఆ సాంగ్ ను సినిమాలోనుంచి తీసేశారు. యూట్యూబ్ లో తర్వాత ఆ సాంగ్ ని విడుదల చేశారు. కానీ అంతగా గుర్తింపు రాలేదు.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ హీరోయిన్ గా సినిమాలు చేయడం లేదు. దాంతో ఆమె అభిమానులు వెయిట్ చేస్తున్నారు. కావాలనే స్పీడ్ తగ్గించిందా.. లేక ఆమెకు ఆఫర్స్ రావడం లేదా.? అని అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంటుంది.

## ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నం

## పెళ్లి వార్తలపై షికింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్



'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది. పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com